




నారాయణపేటలోని నారాయణ స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తుండగా పట్టుకున్న ఏబీవీపీ నాయకులు(ఫైల్)

పాఠశాలల్లో.. వ్యాపారం

- ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయం
- వనపర్తిలో రెండో తరగతి విద్యార్థుల నుంచి రూ.6,000 వసూలు
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- రూ.వేలల్లో ఫీజులు
- అనుమతులు లేకుండానే పలు బడుల నిర్వహణ
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు





వనపర్తిలోని ఓ పాఠశాలలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన పాఠ్యపుస్తకాలు, సాక్సులు

విక్రయానికి ఉంచిన యూనిఫామ్స్



విక్రయించేందుకు రెడీగా ఉన్న బెల్టులు

నారాయణపేట/వనపర్తి రూరల్, జూన్ 25: నారాయణపేట, వనపర్తి జిల్లాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా వ్యాపారం జోరందుకుంది. నాణ్యమైన విద్య అందుతుందనే అభిప్రాయంతో ప్రజలు తమ పిల్లలను ప్రైవేట్ బడుల్లో చేర్పిస్తున్నారు. ఇదే అదునుగా యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తూ, దోపిడీ చేస్తున్నాయి. అడ్మిషన్, మెయింటెనెన్స్ స్పెషల్ ఫీజులు అంటూ తల్లిదండ్రుల రక్తం పీలుస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో మరోవైపు వారే పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్టులు తదితరాలు విక్రయిస్తూ వ్యాపారుల అవతారం ఎత్తారు. పలు పాఠశాలల యాజమాన్యాలు తమ వద్ద చదివే విద్యార్థులు తమ స్కూల్‌లోనే పుస్తకాలు, యూనిఫామ్స్, టై, బెల్టులు తదితర సామగ్రి కొనుగోలు చేయాలని అంటగడుతున్నారు. ప్రైవేటు స్కూల్స్‌లో నోటు పుస్తకాలు, పుస్తకాలు విక్రయించొద్దని ప్రభుత్వం నిబంధనలు పెట్టినా అవేవీ పట్టించుకోవడం లేదు.

నారాయణపేట జిల్లాలో 142 ప్రైవేట్ పాఠశాలలు

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 142 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో దాదాపు 30 వేల పైచిలుకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల నుంచి ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు రూ.13 వేల నుంచి 17 వేల వరకు, ఆరు నుంచి తొమ్మిది వరకు రూ.18 వేల నుంచి రూ.22 వేల వరకు, పదో తరగతికి రూ.23 వేల నుంచి రూ.30 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఐదో తరగతి నుంచి విద్యార్థులకు పాఠశాలల్లోనే పుస్తకాలు, నోటుబుక్స్, టై, బెల్టులు, బ్యాడ్జీలు తదితర సామగ్రిని విక్రయిస్తున్నారు. అందుకోసం రూ.వెయ్యి నుంచి రూ.మూడు వేల వరకు వసూలు చేస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ సిలబస్ పాఠ్య పుస్తకాలు ఉండటంతో స్టడీ మెటీరియల్ పేరిట ఒక్కో విద్యార్థి నుంచి రూ. రెండు వేల నుంచి రూ.మూడు వేల వరకు వసూలు చేస్తున్నారు. పుస్తకాల మోతతో పాటు అధిక ఫీజులు ఆర్థిక భారంగా మారుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తాజాగా ఏబీవీపీ నాయకులు ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేశారు. నారాయణ పాఠశాలలో పుస్తకాలు అమ్ముతుండటంతో పట్టుకున్నారు. ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యా వ్యాపారాన్ని, అధిక ఫీజులను నియంత్రించాలని వారు డీఈవో అబ్దుల్‌ఘనికి వినతి ప్రతం ఇచ్చారు.

తనిఖీ చేయని అధికారులు

వనపర్తి జిల్లాలో 300లకుపైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. 35 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అందులో కొన్ని స్కూళ్లు అనుమతి లేకుండానే కొనసాగుతున్నాయి. గత సంవత్సరం ఒకటి రెండు ప్రైవేట్ స్కూళ్లకు మినహా మిగతా వాటిలో చదివిన పదో తరగతి విద్యార్థులు ఎవరికీ 10 జీపీఏ రాలేదు. 10 జీపీఏ రాని ఓ పాఠశాల 10 జీపీఏతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించామని స్కూల్ వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసింది. అలా మోసపూరిత మాటలతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమై 20 రోజులు కావస్తున్నా స్కూళ్లను విద్యాశాఖ అధికారులు ఇప్పటి వరకు తనిఖీ చేయలేదు. చాలా ప్రైవేట్ పాఠశాలలు అనుమతి లేకున్నా అధికారుల కనుసైగల్లో నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

వనపర్తిలో పుస్తకాల కోసం ప్రత్యేక గది ఏర్పాటు

వనపర్తి జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల్లో యథేచ్ఛగా నోటు పుస్తకాలు, బ్యాగులు, టై బెల్టులు విక్రయిస్తున్నారు. తమ పాఠశాలలో చదివే విద్యార్థులు తమ వద్దే వాటిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలలకు దూరంగా ఒక గదిని ఏర్పాటు చేసుకుని, అక్కడ వాటిని అమ్ముతున్నారు. ముందుగా స్కూల్ ఫీజు, తర్వాత నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి ఫీజు తీసుకుంటున్నారు. అనంతరం ఒక వైట్ పేపర్‌పై పుస్తకాలు ఇవ్వండి అని చీటీ రాసి ఇస్తున్నారు. ఆ చీటీ తీసుకొని పుస్తకాలు దాచిన గదికి వెళ్తే వాటిని అందిస్తున్నారు. పుస్తకాల కోసం రెండో తరగతి విద్యార్థుల నుంచి రూ.6,000 వసూలు చేస్తున్నారు. మూడో తరగతికి రూ.7,000, నాల్గో తరగతికి రూ.8,000, ఐదో తరగతికి రూ.9,000 ఇలా దోచుకుంటున్నారు. పాఠశాల ఫీజు రెండో తరగతి విద్యార్థులకే రూ.30 వేలకుపైగా వసూలు చేయడం గమనార్హం.

ఉపాధ్యాయ బదిలీల బిజీలో ఉన్నా



పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటి నుంచి ఉపాధ్యాయుల బదిలీల బిజీలో ఉన్నాం. ఇక నుంచి అన్ని పాఠశాలలను తనిఖీ చేస్తాం. పుస్తకాలు, నోటు పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం. పాఠశాలల్లో పుస్తకాలు అమ్మొద్దని గతంలో కూడా చెప్పాం. గతంలో వచ్చిన ఉత్తీర్ణత ఫలితాలు పాఠశాలల ముందు ఏర్పాటు చేస్తే తొలగిస్తాం. ఆ స్కూళ్లపై చర్యలు తీసుకుంటాం.

- గోవిందరాజులు, వనపర్తి డీఈవో

పాము కాటుతో బాలిక మృతి

- కొత్తపల్లి తండాలో ఘటన



ఇందు(ఫైల్)

ఖిల్లాఘణపురం, జూన్ 25: వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలంలోని కొత్తపల్లి తండాకు చెందిన మూడావత్ సుజాత, రవి నాయక్ దంపతుల కూతురు మూడావత్ ఇందు(10) మంగళవారం పాముకాటుకు గురై చనిపోయింది. ఎస్‌ఐ శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. ఇందు మంగళవారం తెల్లవారుజామున 1:30 గంటలకు కడుపులో నొప్పి వస్తుందని తల్లి సుజాతను నిద్రలేపింది. రెండు గంటల అనంతరం నోటి నుంచి నురగ రావడంతో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. బాలిక శవానికి పోస్టుమార్టం చేయగా, ఎద భాగంలో పాము కాటు ఆనవాళ్లు కనిపించాయి. ఇంటికి వచ్చి పరిశీలించగా కట్లపాము కనిపించింది. ఇరుగు పొరుగు వారు పామును చంపారు. పాము కాటుతోనే బాలిక మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. బాలిక తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.



బాలిక మృతికి కారణమైన పాము

ప్రసవం కోసం వస్తే.. ప్రాణాలు తీస్తున్నారు





అఫ్రిన్ మృతిపై జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని అనంత ఆస్పత్రిలో విచారణ చేస్తున్న వైద్యాధికారులు



జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత బంధువులు(ఫైల్)

- జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రైవేట్ ఆస్పత్రుల నిర్లక్ష్యం
- మాతాశిశు మరణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన జిల్లా
- ప్రాణాలకు వెల కడుతూ చేతులు దులుపుకుంటున్న యాజమాన్యాలు
- కొరవడిన వైద్యాధికారుల నిఘా
- తాజాగా జిల్లా కేంద్రంలోని అనంత ఆస్పత్రిలో మహిళ మృతిపై జిల్లా వైద్యాధికారుల విచారణ
- భర్త ఫిర్యాదుతో యాజమాన్యంపై కేసు

గద్వాల క్రైం, జూన్ 25: జోగులాంబ గద్వాల జిల్లా మాతాశిశు మరణాలకు అడ్డాగా మారింది. జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సంభవిస్తున్న మరణాలకు నాయకుల అండదండలతో వెలకట్టి, చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ విషయాలు తెలిసినా అధికారులు మాత్రం వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇదే అదునుగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

వరుస మరణాలు

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్ర చైల్డ్ అండ్ మదర్ ఆస్పత్రికి గద్వాల మండల పరిధిలోని కొండపల్లి గ్రామానికి చెందిన గర్భిణి శివలీల(19) ప్రసవం కోసం వచ్చింది. ఆమెకు ఈ నెల నాల్గో తేదీన సిజేరియన్ ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలో బాలింత పరిస్థితి విషమంగా ఉందని, కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. శివలీల అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల తొమ్మిదో తేదీన మృతి చెందింది. ఆమె మృతికి గద్వాల ఆస్పత్రి డాక్టరే కారణమని కుటుంబీకులు శవంతో ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. వారికి రూ.లక్షలు ముట్టజెప్పి చేతులు దులుపేసుకున్నట్లు తెలిసింది.

● జిల్లా కేంద్రంలోని అదే రాఘవేంద్ర చైల్డ్ అండ్ మదర్ ఆస్పత్రిలో ధరూర్ మండలం ర్యాలంపాడు గ్రామానికి చెందిన గర్భిణి గీత ప్రతీనెల చెకప్‌లు చేయించుకుంది. ఈ ఏడాది ఏప్రిల్ 27న ప్రసవం కోసం వచ్చింది. ప్రతీ నెల పరీక్షలు నిర్వహించినప్పుడు తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని చెప్పిన ఆస్పత్రి యాజమాన్యం కాన్పు కోసం వచ్చినప్పుడు శిశువు పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. ఇతర ఆస్పత్రికి వెళ్లాలని రెఫర్ చేయగా, జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమెకు సిజేరియన్ చేశారు. అప్పటికే కడుపులో శిశువు చనిపోయి ఉన్నారని ఆ డాక్టర్లు చెప్పడంతో రాఘవేంద్ర ఆస్పత్రి ముందు బాధితులు ఆందోళనకు దిగారు. అప్పుడూ కొన్ని డబ్బులు ముట్టజెప్పినట్లు సమాచారం.

● తాజాగా జిల్లా కేంద్రానికి చెందిన గర్భిణి అఫ్రిన్ ఈ నెల 19న స్థానిక అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చింది. అదే రోజు సిజేరియన్ ఆపరేషన్ చేసి, శిశువును తీశారు. అయితే బాలింత పరిస్థితి విషమంగా ఉందని, వెంటనే కర్నూల్‌కు వెళ్లాలని సూచించడంతో 20న కర్నూల్‌కు తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లాక కూడా పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో 21న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి ఆమె చనిపోయింది. దాంతో కుటుంబీకులు శవాన్ని తీసుకొని గద్వాలలోని అనంత ఆస్పత్రికి వచ్చి, ఆందోళన చేపట్టారు. వారికి రూ.27 లక్షలు ఇచ్చేలా బేరం కుదుర్చుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలో తన భార్య మృతికి ఆస్పత్రి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని అఫ్రిన్ భర్త అన్వర్ ఫిర్యాదు మేరకు యాజమాన్యం డాక్టర్ అశ్విని, డాక్టర్ వెంకటేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.



అనంత ఆస్పత్రిలో బాలింత మృతిపై ఆందోళన చేపట్టిన బంధువులు(ఫైల్)

నిఘా ఏదీ?

ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రోగుల ప్రాణాలను తీస్తున్నా వైద్యాధికారులు స్పందించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ముడుపులకు ఆశపడి వారిపై చర్యలు తీసుకోవడం లేదా? లేదంటే అధికారులు, రాజకీయ నాయకుల ఒత్తిడితో మిన్నకుంటున్నారా? అనే చర్చ సాగుతోంది. మరోవైపు జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రులపై వైద్యాధికారుల నిఘా కొరవడింది.

షోకాజ్ నోటీసులు జారీ చేశాం

జిల్లా కేంద్రంలోని అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం రాత్రి బాలింత మృతిపై మంగళవారం విచారణ నిర్వహించాము. ఇందుకు సంబంధించి ఆస్పత్రి నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగింది. పూర్తిస్థాయిలో విచారించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడుతాం.

- డాక్టర్ శశికళ, డీఎంహెచ్‌వో, గద్వాల.

ప్రైవేట్ ఆస్పత్రుల బంద్

- దాడులకు నిరసనగా మూడు రోజుల పాటు సేవలు నిలుపుదల
- ఐఎంఏ గద్వాల జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్

ప్రైవేట్ ఆస్పత్రులపై దాడులకు నిరసనగా గద్వాలలోని అన్ని ప్రైవేట్ దవాఖానాలను మూడు రోజుల పాటు బంద్ చేస్తున్నట్లు ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అనంత అనంత మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంత ఆస్పత్రిపై సోమవారం రాత్రి బాధిత బంధువులు అకారణంగా దాడి చేశారన్నారు. అందుకు నిరసనగా జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లీనిక్‌లను మంగళవారం సాయంత్రం నుంచి మూడు రోజుల పాటు బంద్ చేస్తున్నామని, సేవలను నిలిపేస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి ఓపీ కేసులు చూడబోమన్నారు. ఆస్పత్రిలో అంతకుముందున్న పేషంట్లను మాత్రమే పరిశీలిస్తామన్నారు. ఇలాంటి దాడులు మరల పునరావృతం కాకుండా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సమావేశంలో సభ్యులు మోహన్‌రావు, కిశోర్‌కుమార్, భాస్కర్ ఉన్నారు.



పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం చేస్తున్న డీకే అరుణ

ప్రమాణ స్వీకారం చేసిన ఎంపీలు

- మహబూబ్‌నగర్ నుంచి డీకే అరుణ, నాగర్‌కర్నూల్ నుంచి మల్లు రవి

మహబూబ్‌నగర్, జూన్ 25: మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీలుగా గెలిచిన డీకే అరుణ, మల్లురవిలు మంగళవారం ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో ప్రమాణ స్వీకారం చేశారు. డీకే అరుణ తెలుగులోనే ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్కంఠగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి బీజేపీ తరఫున డీకే అరుణ, నాగర్‌కర్నూల్ నుంచి కాంగ్రెస్ తరఫున మల్లురవిలు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ నెల నాల్గున ఫలితాలను వెల్లడించారు.

వీడనున్న చెంచు నాగన్న మృతి మిస్టరీ

- కొడుకు సలేశ్వరం ఫిర్యాదుతో కదిలిన పోలీస్ యంత్రాంగం
- పూడ్చిన శవానికి నేడు పోస్టుమార్టం



కాట్రాజు నాగన్న(ఫైల్)

కొల్లాపూర్, జూన్ 25: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలోని భ్రమరాంబ చెంచు కాలనీకి చెందిన కాట్రాజు నాగన్న(48) మృతి మిస్టరీ వీడనుంది. భూమిని కాజేసేందుకు కొంత మంది నాగన్నను కొట్టి చంపి, పూడ్చి పెట్టారని జాతీయ ఎస్టీ కమిషన్, జిల్లా పోలీస్ యంత్రాంగం ముందు నాగన్న కుటుంబ సభ్యులు ఆరోపించారు. తన తండ్రి నాగన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని కొడుకు కాట్రాజు సలేశ్వరం సోమవారం కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో జిల్లా పోలీస్, రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు నాగన్న శవాన్ని బుధవారం వెలికితీసి, శవ పంచనామా నిర్వహించనున్నట్లు కొల్లాపూర్ తహసీల్దార్ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించి, ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సీఎంఆర్‌ను తక్షణమే అందజేయాలి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్)ను తక్షణమే అందజేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిల్లర్లతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2023-24కు వానాకాలానికి సంబంధించి ఇంకా 41,458 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. ఎన్నిసార్లు అడిగినా మిల్లర్లు స్పందించడం లేదని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రాపర్టీని రికవరీ చేస్తామని, షూరిటీలపై కూడా చర్యలుంటాయన్నారు. వీలైనంత త్వరగా బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాలని మిల్లర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, డీఎస్‌వో స్వామికుమార్, జిల్లా మేనేజర్ బాలరాజు, జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల ప్రవేశాలకు 28న ఎంపికలు

తెలంగాణ రాష్ట్రంలో గల వివిధ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాల కోసం రూపొందించిన పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్ ఆవిష్కరించినట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వి.సీతారాం తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో హకీంపేట్‌లో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం ఎనిమిది నుంచి తొమ్మిది సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు అర్హులన్నారు. జిల్లాస్థాయి ఎంపికలు ఈ నెల 28న జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధికారి చిన్నఓబులేష్ పాల్గొన్నారు.

మొదటి స్థానంలో నిలపాలి

- మహిళా శక్తి కార్యక్రమం అమలుపై కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్) జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వం 5 సంవత్సరాలలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆదాయం వృద్ధి చేసి కోటీశ్వరులను చేయాలనే ఉద్దేశ్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమం అమలులో జిల్లాను మొదటి స్థానంలో నిలపాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా శక్తి కార్యక్రమంపై 15 మండలాల సమాఖ్య అధ్యక్షులకు, డీపీఎంలకు, సీసీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెకర్ పాల్గొని మాట్లాడారు. 2024-25 సంవత్సరంలో మహిళా శక్తి కార్యక్రమం లక్ష్యం నిర్ణయించి బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణ సౌకర్యం కల్పించి జిల్లాలో 14 కార్యక్రమాల అమలుకు కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. మహిళా శక్తి ద్వారా 15 మండలాల్లో 158 గ్రామ సంఘాలతో 6,747 మైక్రో ఎంటర్ ప్రైజెస్‌లు, జిల్లాలో 5 మహిళా శక్తి క్యాంటీన్లు సమీకృత కలెక్టరేట్, మహబూబ్ నగర్ పట్టణం బస్టాండ్, మూసాపేట్ హైవే, సీసీ కుంట, జడ్చర్ల బస్టాండ్‌లలో 40 మందితో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌జి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ, బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణ సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు మహిళా గ్రామ సమాఖ్య సంఘం అధ్యక్షులుగా పాఠశాలలో మౌలిక వసతులు పనులు చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభినందించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్డీవో నర్సింహులు, అదనపు పీడీ బోజప్ప, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు రజిత పాల్గొన్నారు.

కెనాల్‌లో కూరుకుపోయిన
ఆవును కాపాడిన రైతులు

- నాలుగు గంటల పాటు నరకం అనుభవించిన గోమాత
- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యాజమానికి చేరిన సమాచారం


ఆర్డీఎస్ కెనాల్‌లో కూరుకుపోయిన ఆవు

మానవపాడు, జూన్ 25 : ఒండ్రుమట్టిలో కూరుకుపోయిన ఓ గోమాతను తోటి రైతులంతా కలిసి కాపాడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం పోతులపాడు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మానవపాడులో రాజు అనే రైతుకు రెండు ఆవులున్నాయి. గ్రామంలోని ఆవులన్నీ కలిసి రోజూ మేతకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి వచ్చేవి. రోజులాగే మంగళవారం మేత కోసం వెళ్లిన ఆవుల మందలోని ఓ ఆవు పోతులపాడు గ్రామ శివారులోని ఆర్డీఎస్ కెనాల్‌లోని ఒండ్రుమట్టిలో కూరుకుపోయింది. తోటి ఆవులన్నీ తిరుగుముఖం పట్టగా కూరుకుపోయిన ఆవు ఒండ్రు నుంచి బయటకు రాలేక నరకయాతన అనుభవిస్తుండగా సమీపంలో పనిచేస్తున్న రాముడు అనే రైతు గమనిం చాడు. వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో చెన్నిపాడు గ్రామానికి చెందిన ఈశ్వర్, రవి, సతీష్, నారాయణ, పోతులపాడు గ్రామానికి చెందిన బాషాతో పాటు నలుగురు కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. తాడు సాయంతో ఆవును బయటకు తీశారు. యాజమానికి సమాచారం ఇచ్చి ఆవును పంపించారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి
మరో మూడు నెలలు పొడిగింపు

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), జూన్ 25 : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల అక్రిడిటేషన్ కాల పరిమితిని మరో మూడు నెలలు పొడిగించినందున అక్రిడిటేషన్ కార్డుపై స్టిక్కర్ వేయడం జరుగుతుందని డీపీఆర్‌వో శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. స్టిక్కర్‌ను డీపీఆర్ కార్యాలయంలో వేయించుకోవాలని సూచించారు. అలాగే రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ కూడా రాయితీ బస్‌పాసుల గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగిస్తు ఒక ప్రకటనను విడుదల చేసిందని తెలిపారు. బస్సు పాసులను బస్టాండ్లలో నేరుగా పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా స్టాఫ్ రిపోర్టర్లు గమనించాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- స్నేక్ సొసైటీ కోఆర్డినేటర్ కృష్ణసాగర్


పాదయాత్ర చేస్తున్న స్నేక్ సొసైటీ సభ్యులు

పెబ్బేరు, జూన్ 25 : పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని స్నేక్ సొసైటీ కోఆర్డినేటర్ కృష్ణసాగర్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం అలంపూర్ నుంచి హైదరాబాద్‌కు కృష్ణసాగర్ చేపట్టిన యాత్ర మంగళవారం పెబ్బేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని షిరిడీ సాయిబాబా, అయ్యప్పస్వామి, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాల్లో కొబ్బరి, మామిడి, బాదం మొక్కలు నాటి పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పెబ్బేరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీస్ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఆ తర్వాత కంచిరావుపల్లి గ్రామంలో పంచాయతీరాజ్ కార్యదర్శి, విద్యాశాఖ అధికారులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృష్ణసాగర్ మాట్లాడుతూ నిద్రావస్థలో ఉన్న యువతను నిద్ర లేపాలని, ఎప్పుడైనా చిన్నపిల్లలు వర్షం ఎక్కడి నుంచి వస్తుందని అడిగితే దేవుడు కురుపిస్తాడని చెప్పేవారు.. కానీ ఇప్పుడు మనం ఒక మొక్క నాటితే ఒక చుక్క వర్షం పడుతుందని చెప్పాలని కోరారు. పట్టుదలతో ప్రయత్నిస్తే చిన్న విత్తనమే భూమిని చీల్చుకుని మహా వృక్షంలా ఎదుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు పాదయాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణ కోసం చర్యలు తీసుకురావాలని కోరారు. స్నేక్ సొసైటీ సభ్యులు గోపాల్‌యాదవ్, ఉండేకోటి దేవేందర్, అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ రాణి, వనపర్తి జిల్లా విద్యాశాఖ కార్యాలయం సీఎంవో యుగేందర్, మహానంది, బాల వెంకటన్న, ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం సరస్వతి, రాములు పాల్గొన్నారు.

కుచినెర్లలో సినీఫక్కీలో దొంగతనం

- మహిళ మొఖంపై నీళ్లు చల్లి మెడలో ఉన్న బంగారు గొలుసు చోరీ
- మరుసటి రోజే బంగారాన్ని తిరిగి ఇంటి కంపౌండ్‌లో పడేసి వెళ్లిన దుండగులు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి, జూన్ 25 : జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం కుచినెర్ల గ్రామంలో సోమవారం సినీఫక్కీలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఒక మహిళ ముఖంపై నీళ్లు చల్లి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును తీసుకు వెళ్లిపోయారు. ఈ విషయంపై బాధితురాలు కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే మళ్లీ మంగళవారం రోజు బంగారాన్ని దొంగలు బాధితుల ప్రహరీలో పడేసి వెళ్లిన సంఘటన చర్చనీయాంశంగా మారింది.

ఈ సంఘటనపై గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కుచినెర్ల గ్రామానికి చెందిన ఒక మహిళ ఉదయం ఇంటి బయట ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు తమకు దాహంగా ఉందని.. తాగడానికి నీళ్లు కావాలని అడిగారు. దీంతో బాధితురాలు ఇంట్లోకి వెళ్లి తాగడానికి నీళ్లు తెచ్చి ఇవ్వగా వెంటనే ఆ వ్యక్తులు మహిళ ముఖంపై నీళ్లు చల్లడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. ఆ వెంటనే ఆమె మెడలో ఉన్న బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ విషయంపై ఎస్సై శ్రీనివాస్‌రావును వివరణ కోరగా దొంగతనం జరిగిందని బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. తిరిగి మరుసటి రోజు దొంగిలించిన బంగారాన్ని బాధితుల ఇంటి ఆవరణలో పడేసి వెళ్లినట్లు బాధితులు తెలిపారన్నారు. బంగారాన్ని దోచుకెళ్లిన వారు ఎవరనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని, గ్రామాల్లో సంచరిస్తున్న గుర్తు తెలియని వ్యక్తులపై నిఘా ఉంచి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

కొండలు కరుగుతున్నాయ్

- పంచాయతీలకు దమ్మిడి ఆదాయం రాని పరిస్థితి
- అంతా దళారులదే హవా


కరుగుతున్న గుట్ట

అచ్చంపేట, జూన్ 25 : ఎన్నో విధాలుగా ఆదాయ వనరులు ఉన్నా నేటికీ ఉపయోగించుకోలేని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఇసుక, రాయి తగినంత ఉన్నా అవి దళారుల పాలవుతున్నాయే తప్పా వాటితో గ్రామ పంచాయతీలకు దమ్మిడి ఆదాయం లేదు. ఉప్పునుంతల మండలంలో దాసర్లపల్లి నుంచి కొరటికల్ వరకు విస్తరించి ఉన్న దుందుభీ వాగులో ఇసుక లభ్యత భారీగా ఉన్న వాగు పరివాహక ప్రాంత గ్రామ పంచాయతీలకు ఆదాయం లభించడం లేదు. ఉప్పునుంతల, వంగూరు మండలాల పరిధిలో దాదాపు 30 కిలోమీటర్ల మేర దుందుభీ ప్రవహిస్తుంది. ఆయా మండలాల పరిధిలోని తెలకపల్లి, మొల్గర, ఉప్పరపల్లి, సదగోడు, డిండిచింతపల్లి, కంసానిపల్లి, తదితర గ్రామ పంచాయతీల పరిధిలో పుష్కలంగా ఇసుక లభ్యత ఉన్న ఆదాయాన్ని కొందరు ఇసుక మాఫియాగా ఏర్పడి లూటీ చేస్తున్నారు. రోజూ లక్షల్లో వ్యాపారం సాగుతున్న పంచాయతీలకు మాత్రం నయా పైస జమ కావడం లేదు. ఇదిలా ఉంటే మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో 200 ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న గుట్ట నుంచి కొందరు అక్రమార్కులు నెలవారి లీజులకిచ్చి వేల రూపాయలు లబ్ధి పొందుతున్నారు. కానీ కొండలు కరుగుతున్న గ్రామ పంచాయతీకి చిల్లిగవ్వ ఆదాయం రావడం లేదు. ఆయా గ్రామాల్లో కొందరు దళారులుగా మారి ఇతర ప్రాంతాలకు రాళ్లు, కంకర, ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇసుక ట్రాక్టర్లపై కేసు నమోదు

రేవల్లి, జూన్ 25 : వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని బండరాయిపాకుల గ్రామానికి చెందిన వంకేశ్వరం శ్రీరాములు ఏదుల రిజర్వాయర్ నుంచి అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపారు.

సమాఖ్య భవనం పూర్తయ్యేదెన్నడు..?

- భవనం లేక ఇబ్బందులు పడుతున్న మహిళలు
- పదేళ్లుగా అద్దె భవనంలో కొనసాగింపు
- నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరిన మహిళలు

శ్రీరంగాపురం, జూన్ 25 : మండలాలు ఏర్పడి పదేళ్ల గడిచినా మండల మహిళా సమాఖ్య భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉన్న మహిళా సమాఖ్య భవనం పురాతమైన అద్దె భవనం కావడంతో మండల సమాఖ్య సిబ్బంది, సభ్యులు ఇబ్బందులకు గురవు తున్నారు. మండలంలో దాదాపు 300కి పైగా మహిళా సంఘాలు, మూడు వేలకు పైగా సభ్యులు ఉన్నారు. సంఘానికి సంబంధించి ఏ చిన్న సమస్య వచ్చినా సమావేశం ఏర్పాటు చేసుకోవడానికి భవనం లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే నాలుగైదు భవనాల్లో సమాఖ్య భవనం నిర్వహణ జరి గింది. సరైన భవనం లేకపోవడంతో ప్రస్తుతం ఇరుకు గా ఉన్న పాత భవనంలో మండల మహిళా సమాఖ్య భవనం నిర్వహణ జరుగుతోంది. దీంతో పాటు మండ లాల మహిళలకు ఉపాధి అవకాశం కోసం దాదాపు రూ.ఐదు లక్షలతో కారంపొడి మిషన్‌ను కొనుగోలు చేశారు. సరైన స్థలం లేక ఆ మిషన్ కాస్తా మూలకు చేరింది. దీంతో ప్రభుత్వ ఆశయం నీరు గారింది. మ హిళా సమాఖ్య భవనాన్ని ప్రజాప్రతినిధులు, సంబం ధిత అధికారులు పట్టించుకోకపోవడంతో అది మూల కు పడింది. ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి మండల మహిళా సమాఖ్య భవనానికి నిధులు మంజూరు చే యాలని, కారం పొడి మిషన్‌ను ప్రారంభించి మహిళ లకు ఉపాధి అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


పాత భవనంలో కొనసాగుతున్న మహిళా సమాఖ్య భవనం

మహిళా సమాఖ్య భవనానికి నిధులు మంజూరు చేయాలి..



మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం లేక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వెం టనే అధికారులు మహిళా సమాఖ్య భవనానికి నిధులు మం జూరు చేయాలి. దీంతోపాటు మూలకు పడి ఉన్న కారం పొడి మిషన్‌ను వెంటనే ప్రారంభించి, మహిళలకు ఉపాధి కల్పించాలి.

- రహిమాబేగం, మహిళా సంఘం సభ్యురాలు, శ్రీరంగాపురం

ఇబ్బందులకు గురవుతున్నాం..



మండల కేంద్రంలో మహిళా సమాఖ్య భవనం లేక తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నాం. కార్యాలయానికి వచ్చే మహిళ లు ఎలాంటి సమావేశాలు నిర్వహించ కుండానే వెళ్లిపోతున్నారు. కారంపొడి మి షన్‌కు స్థలం లేక వృథాగా పడి ఉంది.

- శ్రీనివాసులు, ఏపీఎం, మండల సమాఖ్య, శ్రీరంగాపురం

ఇంటర్ ఫెయిల్‌తో విద్యార్థి ఆత్మహత్య

మరో విద్యార్థి ఆత్మహత్యాయత్నం


పవన్ (ఫైల్)

అచ్చంపేట టౌన్/ నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 25 : ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా, మరోచోట విద్యార్థి ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు, అచ్చంపేట మండలం రంగాపూర్ గ్రామం లో చోటు చేసుకున్నాయి. అచ్చంపేట ఎస్సై రాము, రంగాపూర్ గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బల్‌రాం, మణెమ్మల కుమారుడు పవన్(17) అచ్చంపేట ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదివాడు. సోమవారం విడుదలైన సప్లిమెంటరీ ఫలితాల్లో కూడా రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. అదేరోజు రాత్రి తల్లిదండ్రులు పొలం నుంచి వచ్చేసరికి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే అతన్ని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. మంగళవారం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అదేవిధంగా, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పద్మావతి జూనియర్ కళాశాలలో రాకేష్(15) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం విడుదలైన సప్లిమెంటరీ ఫలితాల్లో రాకేష్ మ్యాథ్స్, కెమిస్ట్రీలలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై కళాశాల ప్రాంగణంలో క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది గుర్తించి వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

పెద్దకొత్తపల్లి, జూన్ 25 : ప్రమాదవశాత్తు కారు అదుపు తప్పి కల్వర్టుకు ఢీకొట్టడంతో ఓ యువతి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని సికింద్రాబాద్‌కు చెందిన వేదవతి(24), ఫొటోగ్రాఫర్ ప్రవీణ్‌లు హైదరాబాద్ నుంచి కారులో సోమశిల దగ్గర ప్రీవెడ్డింగ్ షూటింగ్ చేయడానికి కారులో వెళ్తుండగా ప్రమాదవశాత్తు వాహనం అదుపు తప్పి పెద్దకొత్తపల్లిలోని పీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద కల్వర్టుకు ఢీకొట్టింది. దీంతో వేదవతి అక్కడికక్కడే మృతి చెందింది. ఫొటోగ్రాఫర్ ప్రవీణ్ తీవ్ర గాయాలకు గురి కావడంతో హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వేదవతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు ఎల్లస్వామినందకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దపులి దాడిలో ఆవుదూడ మృతి

మన్ననూర్, జూన్ 25 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం నల్లమల అభయారణ్య ప్రాంతంలో పెద్దపులి దాడి చేసిన ఘటనలో ఓ ఆవుదూడ మృతి చెందింది. సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మన్ననూరు అటవీ రేంజ్ పరిధిలో గల దుర్వాసుల చెక్‌పోస్టు పరిసర అటవీ ప్రాంతంలో లాల్‌సింగ్‌కు చెందిన ఆవుల మంద సోమవారం మేత కోసం వెళ్లింది. పశువుల గుంపు సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చిన క్రమంలో లాల్‌సింగ్ తన ఆవుదూడ తప్పిపోయినట్లు గుర్తించాడు. ఆవుల మంద మేత కోసం వెళ్లిన అటవీ ప్రాంతంలో పరిశీలించగా దూడ మృత కళేబరం కనిపించింది. ఈ విషయమై మృతి చెందిన ఆవుదూడకు పరిహారం కోసం బాధిత రైతు అటవీ అధికారులకు మంగళవారం విన్నవించాడు. కాగా, ఇటీవల నల్లమల పచ్చబడడంతో పెద్దపులులు, చిరుత పులులు అడవిలో స్వేచ్ఛగా సంచరిస్తున్నాయని, ప్రస్తుతం పెద్దపులులు జత కట్టే సమయం కావడంతో అటవీ ప్రాంతంలోకి పశువులను మేపేవారు జాగ్రత్తగా ఉండాలని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు.

యువకుడి దేహశుద్ధికి మహిళల యత్నం

- బస్సు దిగి పారిపోయిన వైనం

నవాబ్‌పేట, జూన్ 25 : బస్సు ఎక్కడం.. మహిళల్ని ఇబ్బంది పెట్టడం గుర్తించిన మహిళలు దేహశుద్ధికి యత్నించడంతో ఓ యువకుడు పారిపోయిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. నవాబ్‌పేట ఆర్టీసీ బస్టాప్‌లో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఓ గుర్తు తెలియని యువకుడు బస్సులో ఎక్కి మహిళల్ని తాకరాని చోట తాకడం వంటి వెకిలిచేష్టలు తరచూ చేస్తుండడం, మళ్లీ బస్సు దిగడం వచ్చిన బస్సులో మళ్లీ ఎక్కడం మహిళల్ని అలాగే తాకుతుండడం వంటివి చేస్తుండడంతో కొందరు మహిళలు గమనించి అతన్ని వెంబడించారు. చొక్కా పట్టుకునేందుకు యత్నించగా ఆ యువకుడు బస్సు దిగి జారుకున్నాడు. కాగా, గత కొన్నిరోజులుగా బస్టాండ్ ఆవరణలో ఇలా చేయడంపై మహిళలు అసంతృప్తి వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణలో పోలీసు భద్రత పెంచాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

ఆసియా నెట్‌బాల్ టోర్నీలో సత్తా చాటాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్
- భారత మహిళా జట్టుకు మహబూబ్‌నగర్‌లో శిక్షణ శిబిరం


భారత మహిళ జట్టుతో డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 25 : ఆసియా నెట్‌బాల్ టోర్నీలో భారత మహిళా జట్టు సత్తా చాటి విజేతగా నిలువాలని జిల్లా క్రీడాశాఖ అధి కారి శ్రీనివాస్ అన్నారు. సౌదీ అరేబియా దేశం జెడ్డాలో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ ఏడవ తేదీ వరకు ఆసియా నెట్‌బాల్ మహిళా టోర్నీలో పా ల్గొనే భారత జాతీయ నెట్‌బాల్ జట్టుకు జిల్లా కేం ద్రంలోని ఇండోర్ స్టేడియంలో శిక్షణ శిబిరం నిర్వ హిస్తున్నారు. మంగళవారం జిల్లా క్రీడాశాఖ అధి కారి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత జట్టుకు శిక్షణ శిబిరం మహబూబ్‌నగర్‌కు మంజూరు కావటం సంతోషంగా ఉందన్నారు. 20 రోజుల పాటు శిక్షణలో ప్రతిభ చాటాలని, జట్టు విజయానికి క్రీడాకారులు కృషి చేయాలని ఆకాంక్షించారు. నెట్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖాజాఖాన్ మాట్లాడుతూ ఆసియా నెట్ బాల్ టోర్నీలో భారత్‌తో పాటు మరో 15 ఆసి యా దేశాల జట్లు పాల్గొంటాయని తెలిపారు. స్టేడియంలో 20 రోజుల పాటు అన్ని వసతులు కల్పించి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశామని, విజ యవంతంగా శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి, ట్రెజరర్ సోహెల్ ఉర్ రహెమాన్, రాంమోహన్, కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, డీఎస్‌ఏ కోచ్‌లు సునీల్, ఆనంద్ తదితరులున్నారు.

భారత మహిళ జట్టు

సోని, సోనమ్‌శర్మ, పూజచోప్రా, ఐశ్వర్య, గీతాంజలిబగ్గ, యశశ్రీ, పర్వీన్‌జగతప్, ఫాలక్, సురిబి, లక్ష్మి కన్వర్, అశ్వతి పుల్లిమ్‌కుట్టి, మధు, అక్షయగిరి, లితిషాగౌటి, మహి, మహిమ బెనివల్, వర్ష.

చోరీలకు పాల్పడుతున్న నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఎస్పీ యోగేష్‌గౌతమ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట టౌన్, జూన్ 25 : జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించనున్నట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ నిందితుల వివరాలు వెల్లడించారు. మద్యానికి, జల్సాలకు అలవాటుపడిన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ గ్రామానికి చెందిన గడ్డమీది రామకృష్ణ, ఇదే గ్రామానికి చెందిన నంచర్ల శ్రీను, గండీడ్ మండలం సాలనగర్‌కు చెందిన గజ్జి రమేష్‌లు ముగ్గురూ కలిసి చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్మును సమానంగా పంచుకొని జల్సాలు చేసేవారని తెలిపారు. ముగ్గురిపై కోస్గి, మద్దూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాల కేసులు ఉన్నట్లు తమ విచారణలో రుజువైందని పేర్కొన్నారు. తాజాగా కోస్గి చౌరస్తాలో పోలీసులు నాకాబందీ తనిఖీలు చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారని, అదుపులోకి తీసుకొని విచారిస్తే దొంగతనాలకు పాల్పడేవారని తెలిసిందన్నారు. వీరి నుంచి 4.7 కిలోల వెండి, 44 గ్రాముల బంగారం, రూ.లక్షా 50 వేల నగదు, సీలింగ్ ఫ్యాన్లు, వైర్ బెండల్స్, మేకలు, గొర్రెలు ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులను గుర్తించి, తొమ్మిది కేసులను చేధించిన కోస్గి సీఐ సోమనర్సయ్య, ఎస్సై బాలవెంకటరమణ, కానిస్టేబుల్ అంజిలయ్యను ఎస్పీ అభినందించి, రివార్డు అందించారు.

వ్యక్తిపై దాడి చేసి చంపిన కేసులో ఇద్దరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

- రూ.ఐదు వేల చొప్పున జరిమానా
- వివరాలను వెల్లడించిన ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల క్రైం, జూన్ 25 : అకారణంగా గొడవ పెట్టుకొని వ్యక్తిపై దాడి చేసి చంపిన కేసులో ఇద్దరు నిందితులకు మూడు సంవత్సరాల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.ఐదు వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా న్యాయాధికారి కె.కుశ తీర్పు వెల్లడిం చినట్లు ఎస్పీ తోట శ్రీనివాసరావు మంగళవారం తె లిపారు. ఇందుకు సంబంధించి ఎస్పీ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన బరకంబయ్య నర్సింహులు అనే వ్యక్తి 2018, ఆగస్టు 23న ఇంటిదగ్గర ఉన్న కిరాణం దుకాణం వద్ద ఉన్నాడు. అదే గ్రామానికి చెందిన వడ్డె చిన్న తిమ్మప్ప అనే వ్యక్తి నర్సింహులు భార్య అయిన బరకంబయ్య బొజ్జమ్మను బూతులు తిట్టాడు. అయితే ఇంటి దగ్గర ఉన్న భార్యను కిరాణం దుకాణం వద్దకు తీసుకువస్తానని వెళ్లి నర్సింహులు తన భార్యను అక్కడికి తీసుకొచ్చాడు. భార్యాభర్తలు కలిసి కిరాణం వద్దకు రాగానే అక్కడే ఉన్న వడ్డె పెద్దతిమ్మప్ప కల్పించుకొని ఆడదానివి ఇక్కడికి ఎందుకు తీసుకొచ్చావురా అంటూనే నర్సింహులుపై దాడికి వడ్డె చిన్నతిమ్మప్పను ఉసిగొ ల్పాడు. దీంతో వడ్డె చిన్నతిమ్మప్ప నర్సింహులుపై దాడి చేశాడు. అక్కడున్న కొంతమంది వారిని విడి పించడానికి ప్రయత్నించారు. కానీ వడ్డె చిన్నతిమ్మప్ప తన భర్తను చంపాలనే ఉద్దేశంతో నర్సింహులు గొంతు పట్టుకొని బలవంతంగా నొక్కేశాడు. ఈ క్రమంలో నర్సింహులు కింద పడిపోయాడు. లేపేందుకు భార్య బొజ్జమ్మ ప్రయత్నించగా నర్సింహులు అప్పటికే చనిపోయాడు. తన భర్త చావుకు కారణమైన ఇద్దరిపై చర్యలు తీసుకోవాలని 2028, ఆగస్టు 24న కేటీదొడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింద న్నారు. తర్వాత పోలీస్ అధికారుల విచారణలో నర్సింహులును చంపింది నిజమేనని తేలడంతో వా రిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తర లించారు. తర్వాత పరిశోధన పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో జిల్లా అధికారులు కోర్టులో సాక్ష్యం చెప్పే విధంగా సాక్షులను మోటివేట్ చేయడం జరిగింద న్నారు. మంగళవారం జిల్లా న్యాయాధికారి కె.కుశ ఇరువురి వాదనలు విన్న తర్వాత నిందితులపై నేరం రుజువు కావడంతో ఏ1 వడ్డె చిన్నతిమ్మప్ప, ఏ-2. వడ్డె పెద్దతిమ్మప్పలకు మూడు సంవత్సరాల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.ఐదు వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్పీ తెలిపారు.

నేరస్తులకు జైలుశిక్ష పడటానికి పబ్లిక్ ప్రాసి క్యూటర్ వినోదాచారి, కోర్టు లైసన్ రషీద్, కానిస్టే బుల్ ప్రేమ్‌కుమార్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినం దించారు.

గంజాయి పట్టివేత


ఎద్దుల చింతలయ్యను అదుపులోకి తీసుకుంటున్న ఎస్సై

రేవల్లి, జూన్ 25 : వనపర్తి జిల్లా రేవల్లి మండల కేంద్రంలో గంజాయి అమ్ముతూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. ఎస్సై తిరుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... రేవల్లి మండల కేంద్రానికి చెందిన ఎద్దుల చింతలయ్య కూలీ పని చేస్తు జీవనం కొనసా గించేవాడు. గతంలో శ్రీశై లం వెళ్లినప్పుడు ఒక సాధు వు ఇచ్చిన గంజాయి విత్తనాలను తెచ్చి ఇంటి వద్దే వేసి పెంచుతూ వచ్చాడు. పెరిగిన మొక్కలను సరఫరా చేయడం తన వృత్తిగా మార్చుకున్నాడు. గ్రామ స్థుల సమాచారం మేరకు పోలీసులు మంగళవారం చింతలయ్య ఇంటిపై దా డి చేయగా ఇంటి ముందు గంజాయి చెట్లు, ఇంట్లో ఐదు గ్రాముల గంజాయి దొరికింది. ఆర్ఐ శంకర్ పంచనామా చేసిన అనంతరం ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్ర కారం చింతలయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ట్రాక్టర్లు

ఖిల్లాఘణపురం, జూన్ 25 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపు రం మండలం వెం కటంపల్లి గ్రామం లో అనుమతి లే కుండా మట్టిని తర లిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టు కున్నారు. ఎస్సై శ్రీహరి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని చెరువు పక్కన మట్టిని తవ్వి అనుమతులు లేకుండా మంగళవారం మొరం మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామన్నారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సమాచారాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయంపై తహసీ ల్దార్ పాండును వివరణ కోరగా మొరం మట్టి తరలింపు సమాచారాన్ని మైనిం గ్ అధికారులకు తెలిపినట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందన


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అంజలిని అభినందిస్తున్న కలెక్టర్ సంతోష్‌నాయక్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 25 : ఇన్‌స్పైర్ మానక్‌ అవార్డు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అచ్చంపేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని అంజలిని జిల్లా కలెక్టర్ బడావత్ సంతోష్‌నాయక్ అభినందించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గైడ్ టీచర్ అఫ్రీన్‌బేగంతో కలిసిన అంజలిని కలెక్టర్ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగులు ఇబ్బంది పడకుండా సౌకర్యవంతమైన వీల్‌చైర్‌ను అంజలి రూపొందించారు. తాను రూపొందించిన ఈ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆకట్టుకొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గైడ్ టీచర్ అఫ్రీన్‌బేగం తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆలోచనలకు కొదువ లేదన్నారు. అంజలి తాను రూపొందించిన ప్రాజెక్టును జాతీయ స్థాయి పోటీల్లో గెలుపొంది జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఈవో గోవిందరాజులు, అచ్చంపేట జడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జీవన్‌కుమార్, జిల్లా పాఠశాల పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్‌రావు తదితరులున్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

- మహిళకు గాయాలు


బోల్తా పడిన లారీ

చారకొండ, జూన్ 25 : అదుపు తప్పి లారీ బోల్తా పడి ఓ మహిళకు గాయాలైన సంఘటన మంగళవారం ఉదయం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో చోటు చేసుకొంది. హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ నుంచి కల్వకుర్తి వైపు బియ్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి మండల పరిధిలోని మర్రిపల్లి మూలమలుపు వద్ద జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై పోలీసులు ఏర్పాటు చేసిన డ్రమ్ములను ఢీకొట్టి పక్కనే ఉన్న తుమ్మచెట్టుకు తగిలి బోల్తా పడింది. లారీలోనే ఉన్న డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. ఈ ఘటనలో మర్రిపల్లి బస్‌స్టేజీ వద్ద చారకొండకు వెళ్లేందుకు బస్సు కోసం వేచి ఉన్న ఆదే గ్రామానికి చెందిన అంగోత్ శాంతికి డ్రమ్ములు ఎగిరిపడి వచ్చి తగలడంతో ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చారకొండలోని ఓ ప్రథమ చికిత్సాలయంలో ప్రథమచికిత్స చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు దేవరకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శాంతి భర్త ధర్మనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగయ్య తెలిపారు.

సెంట్రింగ్ చెక్కసామగ్రి దగ్ధం

కొత్తకోట, జూన్ 25 : వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామకృష్ణాపూర్ గ్రామంలో


దగ్ధమైన సెంట్రింగ్ చెక్క సామగ్రి

సోమవారం అర్ధరాత్రి రూ.4.5 లక్షల విలువైన సెంట్రింగ్ చెక్క సామగ్రి దగ్ధమైంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రవి సెంట్రింగ్ సామగ్రితో జీవనోపాధి పొందుతున్నాడు. గ్రామంలోని తన పశువుల దొడ్డి వద్ద సెంట్రింగ్ చెక్క సామగ్రిని ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి సామగ్రి దగ్ధమైంది. మంగళవారం ఉదయం దొడ్డి వద్దకు రాగా కాలిన సామగ్రిని చూసి అయోమయానికి గురైయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులా, లేక విద్యుదాఘాతంతో దగ్ధమై ఉంటుందనే అనుమానంతో తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

- ఒకరిపై కేసు నమోదు

చారకొండ, జూన్ 25 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండల కేంద్రంలో ఎక్సైజ్,


బెల్లం పానకాన్ని కిందపోస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్సై వివేక్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై సృజనల ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి, వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఒకరిపై కేసు నమోదు చేసినట్లు కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి తెలిపారు. దాడుల్లో సిబ్బంది మహేష్, సిరాజ్, నార్య, పరుశరాం, మాధవి తదితరులున్నారు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించిన గిరిపుత్రిక


రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించిన శోభారాణి

మద్దూర్, జూన్ 25 : పట్టుదల ఉంటే ఎలాంటి విజయాన్నైనా సాధించవచ్చని నిరూపించింది ఓ గిరిపుత్రిక. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం తిమ్మారెడ్డిపల్లికి చెందిన ధనునాయక్ కూతురు బి.శోభారాణి మూడు అర్హత పరీక్షల్లో ప్రతిభ కనబర్చి రెండు ఉద్యోగాలు సాధించి గ్రామస్థులను ఆశ్చర్యంలో ముంచేసింది. మండలంలోని భూనీడ్ గ్రామంలోని జ్ఞానజ్యోతి పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసించిన శోభారాణి ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో సివిల్ కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయి శిక్షణలో కొనసాగుతూ చదువును కొనసాగించింది. గ్రూప్-4 పరీక్ష రాయగా ప్రస్తుతం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో ఉంది. అయితే, ఉద్యోగం సాధించినా కూడా ఇంతకన్నా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో చదువును కొన సాగించింది. ఈ క్రమంలో టీజీపీఎస్ ప్రకటించిన ఫలితాల్లో భూగర్భ జలశాఖలో గెజి టెడ్ అధికారినిగా ఎంపిక కావడంతో మండల వాసులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తు న్నారు. రెండు ఉద్యోగాలు సాధించిన శోభారాణి పదో తరగతి వరకు తమ పాఠశాలలో విద్యనభ్యసించినందుకు తాము గర్విస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ కృష్ణారెడ్డి అన్నారు. లక్ష్యసాధనకు పట్టుదలతో ముందుకెళ్తే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చని ఓ గ్రామీణ యువతి నిరూపించింది.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

చారకొండ, జూన్ 25: మండల కేంద్రంలోని లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం ఉదయం లలిత సహస్రనామం, విష్ణు సహస్రనామం, భగవద్గీత పారయణం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు దేవాలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం దేవాలయంలో 11:45 గంటలకు లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నక్కలపల్లి, వెన్నచెర్ల మీదుగా బస్సులు నడపాలి



డీఎం వెంకటేశ్‌గౌడ్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి, జూన్ 25 : కొల్లాపూర్ నుంచి నక్కలపల్లి గేటు నుంచి నక్కలపల్లి, వెన్నచెర్ల, నాగపూర్, కొత్తరాయిపాకుల, గుడిపల్లి, నాగనూల్ గ్రామాల మీదుగా నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్సును నడపాలని మాలమహానాడు, వడ్డెర సంఘాల నాయకులు కోరారు. మంగళవారం కొల్లాపూర్ ఆర్టీసీ డీఎం వెంకటేశ్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వినతిలో కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్, జిల్లా సలహాదారుడు టి.లక్ష్మణస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి జెట్టి కుర్మయ్య, మండల అధ్యక్షుడు బండి సుబ్బయ్య, వడ్డెర సంఘం మండల ఉపాధ్యక్షుడు మల్లేష్, నాయకులు నవీన్, నిఖిల్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అచ్చంపేటటౌన్, జూన్ 25: పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు దేశ్యానాయక్ కోరారు. మంగళవారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేయగా పట్టణంలోని సర్వే నెంబరు 213లో స్థలాలు చూపినట్లు తెలిపారు. కానీ, 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల అనుమతి లేకుండా ఆ భూమిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు చేపట్టి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు నచ్చిన వారికి అందజేశారన్నారు. ఎమ్మెల్యే స్పందించి తక్షణమే 213సర్వే నెంబరులో ఇళ్ల స్థలాల పట్టాలను అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నిర్మల, తిరుపతమ్మ, వరలక్ష్మి, సైదులు, మల్లమ్మ, శంకర్ పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో చిన్న ఓబులేష్

తెలకపల్లి, జూన్ 25 : మండల పరిధిలోని కమ్మారెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం నాగర్‌కర్నూల్ డీఆర్‌డీవో చిన్న ఓబులేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు, టీఏ, ఎఫ్‌ఏలకు నర్సరీల నిర్వహణలో తీసుకోవాల్సిన మెళకువలు, నాటిన మొక్కలను సంరక్షించే విధానం గురించి వివరంగా తెలియజేశారు. ఈ సంవత్సరం నాటాల్సిన మొక్కల లక్ష్యానికనుగుణంగా గుంతలు తీయించాలని, వర్షాలు పడగానే మొక్కలు నాటడానికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఏపీవో మల్లేష్, టీఏలు సంధ్య, పర్వతాలు, ఈసీ రామస్వామి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, అనిత, ఎఫ్ఏ రామస్వామి, మేట్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలు సిద్ధం చేయాలి

చారకొండ, జూన్ 25: నర్సరీల్లో ప్రతీరోజు మొక్కలకు నీళ్లు పెట్టి కలుపు మొక్కలను తొలగించి హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో ఇసాక్‌హుసేన్ అన్నారు. మంగళవారం సిర్సనగండ్లలో నర్సరీ, సెగ్రేషన్‌షెడ్లు, వైకుంఠధామం, పంచాయతీ రికార్డులను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్సనగండ్ల వైకుంఠధామంలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అయోధ్యనగర్ గుట్ట వద్ద పబ్లిక్ టాయిలెట్ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం కోసం స్థలాన్ని గుర్తించామని, డీఆర్‌డీవోకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో గృహజ్యోతి, గ్యాస్‌సిలిండర్ కోసం తప్పొప్పులను సరి చేస్తున్నట్లు తెలిపారు. 2024- 25 సంవత్సరానికి ఇంటి పన్ను కట్టడానికి ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సమావేశంలో ఎంపీవో వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు గణేష్, మహేష్‌కుమార్ ఉన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

- నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కుంభం రామకృష్ణగౌడ్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 25: ఇటీవలే చేపట్టిన ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన ఖాళీలను గుర్తించి ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌లో చేర్చి మెగా డీఎస్సీ నిర్వహించాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కుంభం రామకృష్ణగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని గ్రంథాలయం ముందు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త సంజయ్, ప్రధాన కార్యదర్శి గుర్రం శ్రీకాంత్, కోశాధికారి వడ్డెమాన్ శ్రీకాంత్, కరుణాకర్, నరేందర్, శిరీష, జ్యోతి, అనిత, మాధవి, ఉస్మాన్, సురేష్, నవీన్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ చేపట్టాలి

కొల్లాపూర్, జూన్ 25 : కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షణ చేపట్టాలని బీఆర్ఎస్‌వీ జిల్లా నాయకుడు డి.శేఖర్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయ అధికారి విష్ణుకు బీఆర్ఎస్‌వీ, గిరిజన సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు చంద్రశేఖర్, నాగరాజు, సాయి, కార్తీక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెంచుగూడేల్లో వైద్య శిబిరాలు

కొల్లాపూర్, జూన్ 25 : వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ ఆదేశానుసారం కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి, ఎల్లూరు, నార్లాపూర్, మొలచింతలపల్లి భ్రమరాంబ కాలనీ చెంచుగూడేల్లో మంగళవారం వైద్యశాఖ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. చెంచుగూడేల్లో ఇంటింటికి తిరుగుతూ పారామెడికల్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు జ్వర పీడితుల వివరాలను నమోదు చేశారు. అక్కడికక్కడే తగిన వైద్యం అందించడంతోపాటు గర్భిణులను పరిశీలించి రక్తహీనత, బ్లడ్, షుగరు, బీపీ లాంటి పరీక్షలను ఇంటి దగ్గర నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎలాంటి రోగ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స చేయించుకోవాలని డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. వైద్యసిబ్బంది రామ్మోహన్, రమేష్, సాయిరెడ్డి, వెంకటమ్మ, దివాకర్, ప్రభాకర్, భాగ్యమ్మ, శ్వేత, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లమలను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతాం

- గత ప్రభుత్వ తప్పిదాలతోనే కానరాని చెంచుల ప్రగతి

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మన్ననూరు ఐటీడీఏ కార్యాలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, జూన్ 25: నల్లమల అభయారణ్య ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టనున్నట్లు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐటీడీఏ, డీటీడీవో కార్యాలయాల్లో ఖాళీ కుర్చీలు కనిపించగా అధికారులెవ్వరూ హాజరు కాకపోవడంతో ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చెంచుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఐటీడీఏ పరిధిలో కోటి 83 లక్షల నిధులను 37 అంగన్‌వాడీ , ప్రాథమిక పాఠశాల భవనాల నిర్మాణంలో కేటాయించగా, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా అవినీతి అక్రమాలకు పాల్పడినట్లుగా తన దృష్టికి వచ్చిందని, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం నల్లమల ముద్దుబిడ్డ అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో నల్లమల ప్రాంత అభివృద్ధికి ఇతోధికంగా నిధులను కేటాయిస్తామని చెప్పారు. జూలై 5న రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటుగా కలెక్టర్, ఎస్పీ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 మంది ఎమ్మెల్యేలంతా కలిసి నల్లమలలోని పర్యటక ప్రదేశాల్లో రెండు స్టడీ టూర్ ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రికి నివేదిక పంపిస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో నిరుద్యోగ చెంచు యువతకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. మన్ననూరులో రూ.6 కోట్లతో ప్రభుత్వ అతిథి గృహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తమ హయాంలో 2008 లో నిర్మించిన చెంచులక్ష్మీ మ్యూజియాన్ని పునరుద్ధరించి చెంచుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో చెంచుల కోసం ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యం అందిస్తామన్నారు. మన్ననూరు, వటవర్లపల్లి గ్రామాల్లో చెంచుల కోసం ప్రత్యేకంగా రెండు ఉచిత అంబులెన్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో అమ్రాబాద్, పదర మండలాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరందించడం, మద్దిమడుగు పరిసరాల్లో గల ఆంధ్రా తెలంగాణాను అనుసంధానించే కృష్ణానదిపై వంతెన ఏర్పాటు చేసి అమ్రాబాద్, పదర మండలాలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని వివరించారు. సమావేశంలో జిల్లా గిరిజన ఉప విద్యాధికారి శంకర్ నాయక్, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు హరి నారాయణ, జూలూరి సత్యనారాయణ, పంబలి బుచ్చయ్య, శంకరయ్య, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం పరిశీలన

అమ్రాబాద్: అమ్రాబాద్ మండల పరిధిలోని తెలుగుపల్లి గ్రామం వద్ద సుమారు రూ. మూడు కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న కేజీ బీవీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. భవన నిర్మాణ పనులు తక్షణమే పూర్తయ్యేతట్లు చూడాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రహరీ నిర్మాణం కోసం స్థలాన్ని సర్వే చేయించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శ్రీనివాసులు, మండల విద్యా ధికారి బాలకిషన్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు మా దృష్టికి తీసుకురావాలి

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 25: నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజవర్గంలోని వివిధ గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం అమలు వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. సమావేశంలో డీఈవో గోవిందరాజులు, సాంఘిక సంక్షేమ జిల్లా అధికారి రాంలాల్, అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

తాడూరు : ప్రస్తుత సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే ఎవరికైనా మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండంలోని పొల్మూరు గ్రామంలో సద్గురు పరిపూర్ణానంద నేరటి సుదర్శన్‌రెడ్డి రెండవ ఆరాధన మహోత్సవాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదర్శన్‌రెడ్డి ఆధ్యాత్మికతతో అందరినీ ఆకట్టుకునే వారని ఆయనను ఆదర్శంగా తీసుకుని జీవిత కాలంలో కొంతైనా ఆధ్యాత్మికత వైపు కేటాయించి మానసిక చింతన పొందాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు మందడి రోహిణి, కాంగ్రెస్ మండల నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, జంగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, చిన్నపురెడ్డి ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ - పోలీస్ సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జూన్ 25 (ఆంధ్రజ్యోతి) : నూతన క్రిమినల్ న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ సూచించారు. మంగళవారం మహేంద్రన్యాయ విశ్వవిద్యాలయం వారి సౌజన్యంతో నూతన క్రిమినల్ న్యాయ చట్టాలపై నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహేంద్ర లా యూనివర్సిటీ డీన్ బి.బాలకిష్టరెడ్డి, న్యాయవాదులు ఏపీ సురేష్, మధుసూదన్‌రెడ్డి, శివచరణ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన క్రిమినల్ న్యాయ చట్టాలు భారతీయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య ఆదిన్యాయం గురించి తెలియజేశారు. నూతన నేర న్యాయ చట్టాలు ఆధునీకరించబడినవిగా, ఈ నూతన క్రిమినల్ న్యాయ చట్టాలు నేర విచారణలో లింగ వివక్షతలను రూపుమాపడంతో పాటు లింగ సమ్మేళనాన్ని, నేర బాధితులకు ప్రత్యేక రక్షణ చట్టాలు, చిన్న చిన్న నేరాల విచారణ పద్ధతులను కూడా న్యాయ వ్యవస్థలను పటిష్టపర్చి వేగవంతం చేయనున్నట్లు ఎస్పీ తెలిపారు. ఆచార్యులు డాక్టర్ బి.బాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న అధ్యయన ప్రతులను, పుస్తకాలను ఆవిష్కరించి పోలీస్ అధికారులకు అందజేశారు.

పోడు భూముల రైతులకు రుణాలు ఇవ్వాలి

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ అశోక్

కొల్లాపూర్, జూన్ 25 : నియోజకవర్గ పరిధిలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులందరికీ బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం గ్రామంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులతో కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజన దళిత, బీసీ రైతులు ఆర్థిక స్థోమత లేక లక్షల రూపాయలు అప్పులు చేసి పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ వ్యక్తుల దగ్గర వడ్డీలు కట్టలేక అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం తక్షణమే పోడు భూముల రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ఆయన కోరారు. అదేవిధంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న మిగిలిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి.రాముడు, సుక్య, భోజ్యానాయక్, రామునాయక్, శంకర్‌నాయక్, చంద్రునాయక్, సక్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్

కల్వకుర్తి, జూన్ 25 : వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్ డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన వీవోఏల నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీవోఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజకుమార్ పాల్గొని మాట్లాడారు. వీవోఏల సమస్యలపై ఏళ్లగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వీవోఏలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా ప్రభుత్వం గుర్తించి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, రూ. పది లక్షల బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వీవోఏల సంఘం రాష్ట్ర కార్యదర్శి సుమలత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వర్ధం పర్వతాలు, సీఐటీయూ ఆమనగల్ ఏరియా కమిటీ కన్వీనర్ జే.పెంటయ్య, వీవోఏల సంఘం నాయకులు దేవయ్య, శ్రీను, జంగమ్మ, బాలకృష్ణయ్య, కృష్ణారెడ్డి, ఈశ్వర్, నాగేశ్వరి, జంగయ్య పాల్గొన్నారు.

నర్సంపల్లిలో తాగు నీటి ఎద్దడి

వంగూరు, జూన్ 25: మండలంలోని నర్సంపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్‌భగీరథ వాటర్ రాకపోవడంతో వారం రోజులుగా తాగునీటి సమస్య ఏర్పడిందని గ్రామస్థులు తెలిపారు. రెండు స్కీమ్ బోర్లు పని చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక వాటర్ ప్లాంట్ వద్ద వచ్చే వేస్టు వాటర్‌ను తెచ్చుకొంటున్నామని మహిళలు వాపోయారు. సంబంధిత అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు.

నేడు పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

- బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం

లింగాల, జూన్ 25 : ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మండల అధ్యక్షుడు యాదగిరి సలేశ్వరం అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడంలో అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలల యాజమాన్యాలు బంద్‌కు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల విక్రయానికి అనుమతి ఇవ్వండి

- డీఈవోకు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం వినతి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు పాఠశాలల యజమానులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 25: ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల విక్రయానికి అనుమతి ఇవ్వాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం కోరింది. మంగళవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో గోవిందరాజులును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలను విక్రయించుకోవచ్చని హైకోర్టు జడ్జిమెంట్ ప్రకారం ప్రభుత్వం జీవో 91జారీ చేసిందని పేర్కొన్నారు. విద్యార్థి సంఘాల నాయకుల నుంచి ఇబ్బందులు లేకుండా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్య పుస్తకాల విక్రయానికి తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ స్కూల్ యూనియన్ ట్రస్మా జిల్లా అధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాశ్ల రాజు, నాగర్‌కర్నూల్ టౌన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, గీతాంజలి డైరెక్టర్ నరేష్, జోసెఫ్‌రాయ్, కొల్లాపూర్ ట్రస్మా అధ్యక్షుడు రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాడూరు, జూన్ 25 : మండల కేంద్రంలోని ఎం పీడీవో కార్యాలయ సమావేశమందిరంలో బుధవారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి పరోషియా ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో పాల్గొనాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

రేపు వెల్దండ మండల సమావేశం

వెల్దండ, జూన్ 25 : ఈనెల 27న ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్యసమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యపాల్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ తీగలు తొలగించాలి

కల్వకుర్తిటౌన్, జూన్25 : పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో ప్రమాదకరంగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని కాలనీవాసులు కోరారు. మంగళవారం ఏఈ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఏఈ కాలనీలో 11కేవీ విద్యుత్ లైన్ వెళ్తున్న మార్గాన్ని క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు మబ్బు రామరాజు, చిన్నగోరటీ శ్రీను, చిత్తరిశ్రీను, పోలప్రవీణ్, దున్న సురేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి'

తెలకపల్లి, జూన్ 25 : వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు నందిపేట భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని యోగా మందిరంలో నిర్వహించనున్న శిక్షణకు జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, సీనియర్ మెట్లు కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణ, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు కాశన్న, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటించాలి: ఏడీఏ

వెల్దండ, జూన్ 25 : ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే ఎంతో లాభదాయకమని కల్వకుర్తి డివిజన్ ఏడీఏ కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాచూరు రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డివిజన్ పరిధిలోని వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుభరోసా విధివిధానాలు, విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు, పంటల సాగులో అనుసరించాల్సిన విధానాలపై సంబంధిత శాస్త్రవేత్తలు, అధికారులు వివరించారు. సమావేశంలో ఏవోలు మంజుల, శ్రీలత, చిన్నహుస్సేన్, శోభారాణి, ఏఈవోలు ఉన్నారు.

పెద్దకార్పాములలో...

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని పెద్ద కార్పాముల రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతులు తమ వ్యక్తిగత అభిప్రాయాలను తెలి యజేశారు. కార్యక్రమంలో కొల్లాపూర్ డివిజన్ ఏడీఏ రవికుమార్, వ్యవసాయ మండల అధికారులు శ్రీరామ్, రమేష్, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రైతులు రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ఊర్కొండ, జూన్ 25: ప్రజాపాలనలో భాగంగా అభయహస్తం లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతున్నదని, మండలంలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ అన్నారు. మహాలక్ష్మీ, గృహజ్యోతి, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సబ్సిడీ రాని అర్హులైన లబ్ధిదారులు ప్రజాపాలన దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, గ్యాస్ సిలిండర్ రశీదు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అందించాలని కోరారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలను కోరారు.

పాల బిల్లుల పెండింగ్‌కు బీఆర్ఎస్సే కారణం

కల్వకుర్తిటౌన్, జూన్25 : పాడిరైతుల బిల్లుల పెండింగ్‌కు గత ప్రభుత్వమే కారణమని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ప్రభుత్వ రంగసంస్థలైన విజయడైయిరీలోని నిధులను అప్పటి ప్రభుత్వం కన్‌ట్రక్షన్‌పేరుతో ఉపయోగించుకుందన్నారు. పాడి రైతుల సమస్యలను పరిష్కరిచేందుకు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని వివరించారు. అపోహలు సృష్టించేవారి మాటలు నమ్మొద్దని సూచించారు.

ముందస్తు టీకాలు వేయించాలి

చారకొండ, జూన్ 25: పశువుల్లో ముద్ద చర్మ వ్యాధి నివారించేందుకు టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శివకుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలలో తెల్ల పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను పశువైద్యాధికారి శివకుమార్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలలు పైబడిన ఆవులు, కోడేలు, ఆవు దూడలకు ముద్ద చర్మ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వీఎల్‌వో షెక్ మదర్, ఎల్ఎస్ఏ వెంకటేశ్వర్లు, సిబ్బంది శివరాం, గోపాలమిత్ర గిరికుమార్, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

మారేపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం పునరుద్ధరణ

తిమ్మాజిపేట, జూన్ 25 : తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఆర్టీసీ బస్సును పునరుదరింపజేయాలని గ్రామస్థులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిని కలిసి కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నాగర్‌కర్నూల్ నుంచి మారేపల్లి మీదుగా జడ్చర్ల వరకు బస్సు నడపాలని సూచించారు. మంగళవారం బస్సు మారేపల్లి చేరుకోగానే గ్రామస్థులు, నాయకులు కొబ్బరికాయలు కొట్టి పూజలు చేసి స్వాగతం పలికారు. కాంగ్రెస్ నాయకులు ఎస్.మనోహర్, సహదేవ్, వెంకటయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

అధికారుల హామీతో సమ్మె విరమణ

కందనూలు, జూన్ 25 : అధికారుల హామీతో తెలంగాణ మెడికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆ సంఘం నాయకులు సురేష్ తెలిపారు. ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ హాజీమ్ కార్మికులు చేస్తున్న ఆందోళనకు దగ్గరికి వెళ్లి వారితో మాట్లాడి వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం పదిరోజుల గడువు కోరారు. దాంతో వైద్య కార్మికులు సమ్మెను విరమింపజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కా ర్యదర్శి మారేడు శివశంకర్, కార్మికులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ఉప్పునుంతల, జూన్ 25 : వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ రమేష్‌చంద్ర అన్నారు. మంగళవారం ఉప్పునుంతలలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు డాక్టర్ తారాసింగ్, ప్రభుతో కలిసి పది మందికి చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జక్కుల రమాకాంత్, ఫార్మాసిస్టు శ్రీనివాసులు, స్టాఫ్ నర్సు వెంకటమ్మ, వైద్య సిబ్బంది తదితరులున్నారు.